# తిప్పి పంపిన మనియార్డరు

'అర్జున్'

మాచమ్మ ఆ రోజు మధ్యాహ్నం మా మేనత్త వద్దకు రావడంతో ఏదో విశేషం వుందని ఊహించాను. ఆ వూరికి వేసవిలో కాలక్షేపంచేద్దామని వచ్చిన నాకు మాచమ్మ ఏలాంటిదో రెండవదినమే అర్థమైంది - నారదుడంతటిది.

వంటింటిలో గుసగుసలు వినిపించాయి. అందులో ఒకటి రెండు మాటలు 'సుశీల' 'మనియార్డర్' అని మట్టుకు నాకు వినిపించాయి. సుశీల ఎవరో, ఆ మనియార్డర్ ఏమిటో, మొదలు-కొస ఎక్కడా అందలేదు. చెవివొంచి అటువైపు విన్నాను.

"ఏంచెప్పేది వదినా! పోస్టు వీరన్న గుమ్మం దిగుతూనే చెప్పాడు - ఈ తడవగూడా మనియార్డర్ తన వద్దనుండి పుచ్చుకోడానికి ఒప్పుకోలేదట - ఆ విషయం గుప్పుమని వూర్లో అంతా ప్రాకింది. ఆ మనియార్డర్ చిన్న మొత్తమా ఏమన్నానా - వందరూపాయలు" అంది మాచమ్మ. సుశీల తిరస్కరించినందున తనకేదో వచ్చే లంకెబిందెలు తప్పిపోయినట్లు.

'అంతటితో పోలేదు వదినా! వీదంతా వకటే చర్చ! "వందరూపాయలే! తక్కువేంగాదు!" అన్నారు కొందరు. "కొంచంగూడా ఆలోచన లేదు. ఏదో కుర్రతనపు చేష్టలు" అన్నారు వయోవృద్ధులు "ఆవిడకు అది సక్రమమైన మార్గంకాదని చెప్పేవాడెవడులేకే!" అన్నారు సానుభూతిపరులు. "మన మాట వింటుందటయ్యా! వట్టి వెర్రి కోపిష్టి!" అన్నారు, చెప్పిన తమ సలహా పాటించలేదని ఉక్రోషంతో మరి కొందరు. "ఈ లాంటివి ఎన్నో విన్నాను. వినగలంగాని చేసేదేముంది." అంది మాచమ్మగారు. ఈ దఫా! వార్తలు మోయడంలో ఈ లాంటి వార్త మోసుకొచ్చింది. మరుసటి పది నిమిషాలు ఆ మాట ఈ మాట మాట్లాడి వెళ్ళింది.

అసలు విషయం ఏమిటో లీలగానైనా అర్థంగాలేదు. ఇంతవరకు 'సుశీల అనే ఆవిడ - నూరు రూపాయల మనియార్డరును త్రిప్పి పంపివేసిందని' అర్థమైంది.

గంట తరువాత నా వద్దకొచ్చింది అత్త.

చొరవచేసుకొని "అత్తయ్యా ఇంతకుముందు మీరు సుశీల మనియార్డర్ అని ఏదో చర్చ జరుపుతున్నారే! ఎవరావిడ! ఆ మనియార్డర్ కథేమిటి?"

"మనవూరిపిల్లే శాంతా! తల్లితండ్రిలేరు! ఎక్కడో విదేశంలో పెళ్ళాం బిడ్డలతో కాపురంవున్న అన్న ఒకడున్నాడు. వచ్చిన వందరూపాయలు ఆ విడ భర్తనుంచే!" "ఆ విడ భర్తనుంచా? అయితే ఆ విడ ఎందుకు తిరస్కరిస్తుంది?" "అదే ఎవరికీ తెలియదు. బ్రతకడానికి చాలా కష్టాలుపడుతూ కూడా ఆ డబ్బు తిరస్కరిస్తున్నది. ఆ దంపతుల మధ్య ఏదో పట్టింపువచ్చి వుండొచ్చు!" అంది అత్తయ్య. "అదిగాదత్తయ్యా! అలా చెప్పితే ఏలా చెప్పు! సుశీల ఎవరు! ఏమిటి?" "చాలా వివరం చెప్పవలసివుంటుంది శాంతా! సుశీల ప్రస్తుతం భర్తను విడిపించి-వచ్చి ఇక్కడవుంది. ఏకాకి-కొంతకాలం క్రిందట ఆ విడ అన్నగారు ఇక్కడికొచ్చి చూచి-తన వట్టిచేతులు చూపివెళ్లాడు. ఆమె భర్త భాగ్యవంతుడు. లక్షాధికారట. అతనే భార్యకు ఆ వందరూపాయలు పంపిస్తున్నాడు. కాని ఏం ఫలం! సుశీల ఏమాసం పుచ్చుకొన్నదిలేదు. తిప్పి పంపుతూనేవుంది. తిప్పి పంపడానికి కారణం ఎవరికీ నికరంగా తెలియదు! ఈ వూరిలోవారందరు చెప్పేవి వారి ఊహలు మాత్రమే! సుశీల బుద్ధిమంతురాలు! స్వయంశక్తిపై, తన కాళ్లపై తాను నిలబడాలనే, ఆ విడ అభిప్రాయం. అందుకే మట్టు

మిషన్ తెప్పించి-పనిచేస్తున్నాడట” అని నిలిపింది అత్తయ్య!

అత్తయ్య మాటల్ని విన్నప్పటినుండి - ఆవిడి పరిచయంపొంది - ఆవిడతో కలిసిమెలిసేవుంటూ - ఆ నిర్భాగ్యురాలిచరిత్ర వినాలనిపించింది. ఆ లాటి ఆసక్తికలిగింది. సుశీల నోటిమీదుగా ఆవిడ స్వీయ చరిత్ర వినాలనేకోరిక బలవత్తరమైంది.

ఆ రోజు సాయంత్రం-వారింటికి వెళ్ళాను. తలుపులువేసివున్నయి. లోపల మిషన్ తిరుగుతున్న శబ్దంవినిపించింది. ధైర్యంచేసి తలుపుతట్టాను. సుశీల తలుపుతెరిచి ఆహ్వానించింది. ఆవిడలో మచ్చుకైనా ఆశ్చర్యంకనిపించలేదు. మర్యాదగానే ఆహ్వానించింది. చాపపరిచి కూర్చోమంది. తను మిషన్‌పై పని ప్రారంభించింది. తలుపు తెరవడానికిగా నిలిపిన మిషన్ తిరిగి తిరగడం ప్రారంభించింది. నేనే మా చుట్టరికం ఎరుకపరిచాను. ఆవిడా కలుగొపుతనంగా మాట్లాడింది. మాట్లాడుతున్న సమయంలో ధైర్యంచేసి నేనే అడిగాను “మీరు మనియార్డర్ని తిప్పి పంపుతున్నారట! అసలు విషయమేమిటో చెప్పండి?” అని.

“ఆ డబ్బును నేనెందుకు స్వీకరించాలి?” అని ఆవిడే ఎదురు ప్రశ్న వేసింది.

కొంచెంసేపు మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం ఆవరించింది. కడకు నేనే “ఏం! ఎందుకు స్వీకరించకూడదు! అది మీ భర్తగారి డబ్బు! వారు మీ పోషణకు పంపుతున్నాదేగా? అలాంటప్పుడు దాన్ని స్వీకరించడానికి అభ్యంతరంఏముంది చెప్పండి!”అన్నాను.

నా ప్రశ్నకు సమాధానం చెప్పడానికి బదులు - సుశీల బర్ బర్‌మని మిషన్ని వేగం హెచ్చించి త్రిప్పింది. మిషన్ చక్రంలా ఆవిడ తలలో పూర్వపు స్మృతులు-గిర్రున తిరిగాయి. కొంచెం సేపటికి మిషన్ వేగం తగ్గించి “శాంతా! నేను చెప్పవలసింది చాలా పెద్ద కథ. ఈ దురదృష్టవంతురాలికథ వినిపించదగ్గది గాదు. చెప్పి నీ మనస్సు బాధ పెట్టడం మంచిది గాదని భావిస్తున్నాను!” అంది గద్గద కంఠంతో.

“మీకు మనస్సులో కలికినట్టుంటే చెప్పకండి సుశీలగారు! నిజంచెప్పితే నమ్ముతారో లేదో! మీ యొక్క కష్టాల్ని ఆత్రుతగావిని నిట్టూర్పు విడవడానికికాదు నేను వచ్చింది. మీకు ప్రాప్తించిన ఈ దురదృష్టాన్నిచూచి సానుభూతి తెలియజేద్దామనే నా కోరిక!” అన్నాను నేను.

“అయితే ఈ నిర్భాగ్యురాలిగాథ వింటారా” అని చెప్ప మొదలిడింది.

“నేను పుట్టిన కుటుంబం పెద్ద ఉన్నత వంశానికి చెందిందిగాదు. మా నాన్న సామాన్య గృహస్థుడు. కఠినదరిద్రులు కాకపోయినా ధనవంతులుగాదు. కాని నాకు వయస్సొచ్చి వివాహం చిత్రంగా జరిగింది. మా మేనమామకు సంఘంలోవుండే పలుకుబడి, దేముడి దయవల్ల అనుకోకుండా నాకు ధనవంతుడు, విద్యావంతుడైన భర్త లభించాడు. కానీ కట్నంలేకుండా, చదువుకున్నట్టి, లక్షాధికారి అయిన భర్త లభించడంతో మా నాన్న, అమ్మ బ్రహ్మరథం పట్టినంత ఆనందం అనుభవించారు.

మా వారు చాలా నెమ్మదస్తుడు, బుద్ధిమంతుడు. కాపరానికి వెళ్ళిన నాలుగు సంవత్సరాలవరకు - రాజభోగం అనుభవించాను. నేను దాహానికి నీళ్లడిగితే - ఆ యింట్లోవాళ్లు, మా వారు పాలందించేవారు. ఇంటిలోని వ్యక్తులందరూ, అనురాగాన్ని వెలిబుచ్చేవారు. కాని నాలుగు సంవత్సరాలు గడిచినా నా గర్భాన ఒక కాయ కాయకపోవడం ఇంటిలోని అత్తమామలికి నిరాశ కలుగజేసింది. నేనేం పాపంచేసానో - పిల్లలు కలగలేదు. చిన్న చిన్నగా వారి అనురాగం తగ్గిపోయింది.

ఇంట్లో-వాళ్లు అభిమానం చూపకపోయినా, మా వారు మటుకు అనురాగంతో పూర్వంలా వుండంతో ఎంతోసంతోషించాను. కాని నా సంతోషం కొన్ని నెలలలోఅంతమైంది. ఆ తరువాత మా వారుగూడా చీటికి మాటికి కోపగించకోవడం - నేనంటే అయిష్టత

చూపసాగారు. ఏంచేసేది? కింసాస్తిని పూరు కొన్నాను. దేవుని అనుగ్రహంలేదని మిన్నకున్నాను.

ఒక దినం సాయింత్రం మా వారు ఆఫీసునుండి అనుకున్న వేళకంటే ముందొచ్చారు. వారిలోమార్పు కలిగిందేమో అని సంతోషించాను. ఎన్నిదినాలకు అర్ధాంగి హృదయాన్ని అర్ధం చేసుకొన్నారని వారిని నాలో నేనే పొగిడాను. పిల్లలు వుండడం లేక పోవడం మనచేతిలోని విషయంకాదు. మనంబాధ్యులం కాదని వారికీ తెలుసు - డాక్టర్లు చేయవలసిన పరీక్షలు చేశారని అందరికీ మా యింట్లోవారికి తెలిసిందే!

కాని మరో పదినిమిషాలకు నేనూహించిందంతా ఊహాకల్పనగానే నిలచిపోయింది. పరిస్థితులు తల్లక్రిందులుగా ఏర్పడ్డాయి.

ప్రేమగావారు "సుశీల" అని పిలిచి తన ఎదుట కూర్చునబెట్టి తను కుర్చీ చేతులపై ఆనుకొని కూర్చొని ఏదో చెప్పాలనిప్రయత్నించారు. నిజంగా ఆప్రదేశం, ఆస్థితి నన్ను వెర్రెత్తించింది. ఖైదీలాభావించాను.

వారు చిన్నగా మాట్లాడారు. అందులో సారాంశం - వారి నాన్నా అమ్మా, పిల్లలులేనందుకై మరల వివాహంచేసుకోమని చెప్పారట. అందుకు కారణం నేను గొడ్రాలుగావడమేనట. తాను వారికోరిక తీర్చ నిశ్చయించారట. తనకు సంతానం లేకుండా వుండడం ఇష్టంలేదట. తన సిరిసంపదలకు వారసుడు లేక వారసులు కావలసివుందని — చేసుకోదలచానని చెప్పారు!

అది విన్న నేను దానికిసరిఅయిన జబాబుగా 'అయితే మీకు మీధనం, మీ సంపదలు - మీ అర్ధాంగి అయిన నాకన్నా ముఖ్యమా! మీ సుఖదుఃఖాలలో భాగస్వామినిగానా?' అని అనాలనుకొన్నాను. కాని నిగ్రహించుకొని నోరుమెదపలేదు. కాని అశ్రుధారలను నిలుపలేకపోయాను. నాకన్నుల నుండి నీటిబొట్లు జలజలరాలాయి. దానివల్ల ఆయనలో చైతన్యం - తను చేస్తున్న అన్యాయం అర్థంచేసుకుంటారని అనుకున్నాను. కాని అందుకు బదులు నిలువెత్తున కోపంపుట్టుకు వచ్చింది "ఛీ! ఛీ! వెధవఏడుపు - నీవూ! మాకుటుంబం - పచ్చగా వుండడం నీకిష్టంలేదా! మన్నులోకలసిపోవాలనేనా నీ కోరిక! మానాన్న వాళ్లు ఈ ఇంటి మర్యాదలకు సుఖానికి చేసిన ప్రతిపాదనలకు ఏడుస్తావేం! ఒక్కటి మటుకు నీకు హామీయిస్తున్నాను. నేను మళ్లీ పెళ్లి చేసుకున్నా - నీకు ఏలాంటి అడ్డంకులుండవు. నీవు ఇక్కడే వుండవచ్చు. అందరితోపాటు అన్నీ అనుభవించవచ్చు! నిన్ను చిన్నచూపు చూచేవారుండరు!" అన్నారు మా వారు.

అంతటితో ఆ రోజు ముగిసింది. ఆ తరువాత నాల్గువదినం తాంబూలాలు పుచ్చుకొన్నట్లువిన్నాను ఒక్కసారి పరిస్థితుల్ని అవగాహనం చేసుకున్నాను.

ఆ యింటిలో - అనురాగాన్ని, ప్రేమని లెక్కచేయినట్టి, ఒకవిలువకట్టలేని ఆ యింటిలో వుండడం సుఖముగా తోచలేదు. కావలసింది ఆత్మగౌరవం.

మరునాడు సాయంత్రం ఈ పల్లెకు ప్రయాణమైనాను. మా అత్తమామలు అడ్డగించలేదు. మా వారు మటుకు బండికట్టించి పంపారు. నా కాళ్లమీద నేను నిలబడదలచాను. అందుకే ఈ కుట్టు మిషన్ - అదే నా యిల వేల్పు.

కాంతా! నన్ను, నాకోరికను! అనురాగాన్ని మన్నించనివారి, బంగారాన్ని డబ్బును నేను మన్నించాలా! దానిబదులు ఆకలిదప్పులతో అలమటించి చావచ్చు! అంది సుశీల. ఆమె విషాదగాథ నన్ను అశ్రుధారలు కార్పించింది. హృదయంలో ఏదో ఒక రకమైన అనుభూతి కలిగింది.

("ప్రియదర్శినీ" గుజరాతి కథ ఆధారంగా)